సమగ్ర సర్వేకు ఏర్పాట్లు పూర్తి

శిక్షణా కార్యక్రమంలో అధికారులు


నేలకొండపల్లి: శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యర్రయ్య

● కూసుమంచి: మండలంలో శనివారం నుంచి ప్రారంభంకానున్న సమగ్ర సర్వేకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కూసుమంచిలోని రైతు వేదికలో సర్వేలో పాల్గొనే 14 మంది సూపర్‌వైజర్లు, 148 మంది ఎన్యూమరేటర్లు, 14 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించగా.. ఎంపీడీఓ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీఓ రాంచందర్, ఎంపీఎస్ఓ మౌనిక పాల్గొన్నారు.

● నేలకొండపల్లి: సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం 30 మంది సూపర్‌వైజర్లు, 158 మంది ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇవ్వగా ఆయన సర్వేకు సంబంధించిన మెటీరియల్‌ను అందించి పలు సూచనలు చేశారు.149 బ్లాక్‌లలో సర్వేను వెంటనే ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, మండల పంచాయతీ అధికారి శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

● రఘునాథపాలెం: సమగ్ర సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం రఘునాథపాలెం రైతు వేదికలో కులగణనలో పాల్గొనే సిబ్బందికి రెండో దఫా శిక్షణలో పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రతీ ఇల్లు పరిశీలించి కుటుంబాల వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ అధికారులు, వివిధ విభాగాల ఇంజనీర్లు ఉన్నారు.

కేఎంసీలో 55,697 ఇళ్లకు స్టిక్కర్లు

మూడో రోజు ఈబీలు మార్పుల కోసం ఎన్యూమరేటర్ల క్యూ

మొత్తం ఇళ్ల సంఖ్య	1,61,144
ఈబీల సంఖ్య	965
ఎన్యూమరేటర్లు	965
సూపర్‌వైజర్లు	26
సర్వే ప్రారంభమైన ఈబీలు	965
పూర్తయిన ఇళ్లు	55,697

ఖమ్మంమయూరిసెంటర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కేఎంసీలో మూడో రోజు కొనసాగింది. తొలి రెండు రోజులతో పోలిస్తే మూడవ రోజు కొంతమేర సర్వే ప్రక్రియ వేగవంతం అయినట్లు తెలుస్తోంది. తొలి రెండు రోజులు 23 వేల ఇళ్లను మాత్రమే ఎన్యూమరేటర్లు గుర్తించగా.. శుక్రవారం 22,328 ఇళ్లకు స్టిక్కర్లు వేశారు. కాగా సర్వే ప్రారంభమై మూడు రోజులు అవుతున్నా.. కేఎంసీలో ఎన్యూమరేటర్ల సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. గురువారం విధులకు వచ్చిన ఎన్యూమరేటర్లు కొంతమంది శుక్రవారం గైర్హాజరు కావడంతో వారి స్థానంలో కొత్త వారిని నియమించేందుకు అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఇక ఇప్పటికే ఈబీలు కేటాయించిన తర్వాత వాటిని మార్చి తమకు అనువైన స్థానంలో ఈబీని కేటాయించాలని కోరుతూ శుక్రవారం పలువురు కేఎంసీ కార్యాలయంకు వచ్చి అధికారులను కలిశారు. సర్వే ప్రారంభమైన తర్వాత ఈబీలు మార్పుతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని, రెండు కిలోమీటర్ల లోపు కూడా సర్వేకు వెళ్లలేమని చెప్పడం అభ్యంతరకరంగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో స్టిక్కర్లు వేయడం పూర్తి అయితే కేఎంసీలో మాత్రం 33 శాతం మాత్రమే పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు


డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న హెచ్‌డబ్ల్యూఓ ఫోరం బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు తెలంగాణ హెచ్‌డబ్ల్యూవోస్ ఫోరం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం జిల్లాలోని మధిర పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎంను హెచ్‌డబ్ల్యూఓ ఫోరం బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. పెరిగిన మెస్, కాస్మోటిక్ చార్జీల వివరాలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించేలా ప్రతీ వసతిగృహంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని వసతిగృహ సంక్షేమ అధికారులకు సూచించారు. పౌష్టికాహారంతో కూడిన కొత్త మెనూను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటపాటి రుక్మారావు, నెల్లూరి నాగేశ్వరరావు, కోశాధికారి కె.తిరుపతిరావు, హెచ్‌డబ్ల్యూవోలు ఈ.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, ఎస్‌కె సలీం, కె.శృతి తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి

కామేపల్లి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో కొనసాగుతూ విప్లవోద్యమంలో అమరులైన వారి ఆశయసాధనకు కృషి చేయాలని ఆ పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని హరిచంద్రాపురంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకులు సనాతన ధర్మం, మతోన్మాద భావజాలంతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి తమ రాజకీయ ప్రాబల్యం కోసం ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి దేశ సంపతను కొల్లగొడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుగులోత్ బీమ్‌సింగ్, జర్పుల సామ్యానాయక్, వాగ్యానాయక్, సాల్కు, లాల్‌సింగ్, మంగ తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై అధికారుల సర్వే

రఘునాథపాలెం: మండలంలోని చెరువు కొమ్ముతండాలో గుడారా చెరువు ఆక్రమణకు గురైయినట్లు గ్రీవెన్స్‌లో ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేశారు. ఇరిగేషన్ ఏఈ తిరుపతమ్మ, సర్వేయర్ శివలు చెరువు హద్దులు గుర్తించి ఎంతమేరకు అక్రమణకు గురైయింది అనేది సర్వే పూర్తయితే తెలుస్తుందన్నారు. చెరువు శిఖంలో ఎకరాల్లోనే ఆక్రమణ అయినట్లు గ్రామస్తుల ఆరోపణలు ఉన్నాయి. ఈ సర్వేలో అధికారులతో పాటు గ్రామానికి చెందిన భూక్యా వెంకన్న, భూక్యా రమణ, భూక్యా జమ్లా, బానోత్ జాంపా, భూక్యా శంకర్, బదవత్ మంగు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ధాన్యం కాంటాలు

కూసుమంచి: మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో శుక్రవారం ఎట్టకేలకు కాంటాలను ప్రారంభించడంతో రైతులకు ఇబ్బందులు తొలగుతున్నాయి. గత పది రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన మిల్లర్లు ఎలాట్‌మెంట్ కాకపోవడంతో కాంటాలు నిలిచిపోయాయి. దీంతో రైతులు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉన్నతాధికారుల చర్యల మేరకు మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు ముందుకు రావడంతో కాంటాలను ప్రారంభించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

కూసుమంచి: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బరిలో దిగిన ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోమారు గెలిపించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మండవ నర్సయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాయల వీరస్వామి, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షులు చిలకల శ్రీనివాసరావు, రేల విక్రమ్‌రెడ్డి, బాబురావు, జుబేదా, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'న్యూ ఇరా'లో ఉపాధ్యాయులకు శిక్షణ

ఖమ్మం సహకారనగర్: తమ పాఠశాలలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు బోధన అంశాలపై టీ-శాట్ కార్యక్రమాలకు వృత్యంతర శిక్షణ తరగతులు నిర్వహించినట్లు న్యూ ఇరా చైర్మన్ ఐవీ రమణారావు, అకాడమిక్ డైరెక్టర్ భూమేశ్వరరావు, క్వాలిటీ మేనేజర్ గోపాలకృష్ణలు తెలిపారు. రీసోర్స్‌పర్సన్ వడ్డె చంద్రశేఖర్ ఆధ్వర్యాన శిక్షణ నిర్వహిస్తున్నామని పేర్కొని ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు వినతులు..

పెండింగ్ జీతాలు చెల్లించాలి


డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ జీతాలు ఇవ్వాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యాన డీపీఓ ఆశాలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు పిట్టల మల్లయ్య మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందికి గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, రెండు నెలల జీతాల చెక్కులు ఇచ్చినా, అవి సిబ్బంది అకౌంట్‌లలో జమకాలేదన్నారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో దశలవారీగా ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి చెన్నారావు, బి.కృష్ణారెడ్డి, కె.మహేష్, రాందాస్, మంగీలాల్, రాజగోపాల్, కె.నాగేశ్వరరావు, సీతారాములు, రేణుకా, విజయ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


డీఈకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని త్రీటౌన్ 30వ డివిజన్‌లో పోల్ నంబర్ 63/1కేఎంసీ42/247 సైడ్ డ్రెయిన్ మధ్యలో విద్యుత్ పోల్ ఉండడం వలన అక్కడి ప్రజలకు ప్రమాదకరంగా ఉందని దానిని వెంటనే తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం, జిల్లా నాయకుడు నూనే శశిధర్ కోరారు. శుక్రవారం సమస్యలపై విద్యుత్ డీఈని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఈ సమస్యను పరిష్కరించడంలేదన్నారు. చాలామంది నిరుపేదలకు గృహజ్యోతి పథకంలో అవకతవకలు సరిచేసి అర్హులకు చేరేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతి అందించిన వారిలో సహాయ కార్యదర్శి యానాలి సాంబశివారెడ్డి, రవీందర్, గాదె లక్ష్మీనారాయణ, ముజమిల్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఖమ్మంరూరల్/ఖమ్మం మామిళ్లగూడెం: దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఎస్సీ, ఎస్టీ యాక్టు నమోదు చేయాలని మాల మహానాడు రాష్ట్ర సీనియర్ నాయకుడు గుంతేటి వీరభద్రం డిమాండ్ చేశారు. ఖమ్మంరూరల్ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన కొందరు అదే గ్రామానికి చెందిన సామేలుపై దాడి చేయడంపై తీవ్రంగా ఖండించారు. దాడిలో గాయాలుపాలై కాలు విరిగిన సామేలును శుక్రవారం మాలమహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఖమ్మంలో పరామర్శించారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ సామేలుకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు లింగాల రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


సామేలును పరామర్శిస్తున్న నాయకులు

పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రావొద్దు


కార్మికుల హాజరును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్య నిర్వహణ, సమస్యలపై ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని 24వ, 46వ, 48వ, 53వ డివిజన్లలో అసిస్టెంట్ కమిషనర్ పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించి, కార్మికుల హాజరు నమోదు పట్టికలను పరిశీలించారు. డివిజన్లలో క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదని, డ్రెయిన్లలో మురుగు తొలగించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. పారిశుద్ధ్య పనులు చేసిన తర్వాత స్థానికుల నుంచి పని పూర్తయినట్లు సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. పని లెక్కలు పక్కాగా ఉండాలని, పనికి రాకుండా హాజరు వేస్తే సహించేది లేదన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నాయీబ్రాహ్మణ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నగర నాయీబ్రాహ్మణ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న యలమందల జగదీశ్‌కు తన పూర్తి సహకారం ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఖమ్మం నగర నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా పోటీచేస్తున్న జగదీశ్ ఖమ్మంలో భారీ బైక్ ర్యాలీతో వెళ్లి ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించి ఆశీర్వాదం కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనివాస్, నంద్యాల రాము, సైదులు, శ్రీరాములు, విజయ్, పాపారావు, సందీప్, శ్రీనివాస్, నరసింహారావు, శ్రీరామ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ..

నేలకొండపల్లి: కార్తీకపౌర్ణమి సందర్భంగా మండలంలోని రాజేశ్వరపురంలో ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు పోటీల పోస్టర్లను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. రాజేశ్వరపురం సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తితో పాటు యర్రబోయిన నర్సయ్య, చిట్యాల రమేష్, దండా సత్యనారాయణ, దండా వెంకటేశ్వర్లు, రెడ్డిబోయిన నవీన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల నిర్మించాలి



మాట్లాడుతున్న నాయకులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలో 254వ సర్వే నంబర్ ప్రభుత్వ భూముల్లో ఐటీఐ కళాశాల నిర్మించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఎండీఓ ఆఫీస్ ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని, ఎస్‌బీఐ బ్రాంచ్ తక్షణమే ఏర్పాటు చేయాలని, ఎమ్మార్వో ఆఫీస్‌కు నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో మాతా శిశు కేంద్రం ఏర్పాటు చేసి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ మండల కేంద్రంలో ఆపాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు కొమ్ము శ్రీను, గొర్రెపాటి రమేష్, గంట కృష్ణ, గుగ్గిల అశోక్, రామ్‌గోపాల్, రామారావు, చీమ రామకృష్ణ, మట్టి నాగేశ్వరరావు, కొమ్ము పూలే, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో కథ, కవిత్వం, గేయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల సాహిత్య వేదిక కన్వీనర్ కొండ్రు బ్రహ్మం మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచడంతో పాటు కవులుగా, రచయితలుగా ఎదిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, సత్యనారాయణ, మానిక్యరావు, శంకర్, రఫీ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వినియోగంపై..


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: సోషల్ మీడియా వినియోగంపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ ఖమ్మం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ బ్రాంచ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్‌లు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోషల్ మీడియా వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వివిధ కేసులలో వారి అనుభవాలు వివరించి ఎలా అప్రమత్తంగా ఉండాలో సూచించారు. సోషల్ మీడియాలో ఫొటోలు, వ్యక్తిగత సమాచారం ఇతరులకు పంపకుండా ఉండాలని, ఏదైనా సమస్యలు వస్తే షీ టీమ్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 'ఎస్‌బీఐటీ' చైర్మన్ జన్మదిన వేడుకలు


చైర్మన్‌కు కేక్ తినిపిస్తున్న నాగభూషణం, పక్కన కృష్ణ కుటుంబీకులు

ఖమ్మం సహకారనగర్: ఆర్‌జేసీ, ఎస్‌బీఐటీ విద్యాసంస్థల చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు గుండాల కృష్ణ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల కృష్ణ - కవిత దంపతులు స్థానిక శివాలయంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే, విద్యాసంస్థల్లో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు జి.ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ.శివప్రసాద్, ఎన్.శ్రీనివాసరావు, రవీంద్రబాబు, ప్రిన్సిపాళ్లు రాజ్‌కుమార్, ఎ.లింగయ్య, ఎస్.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు. ఇంకా కార్పొరేటర్ పసుమర్తి రాంమోహన్, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు యర్రా అప్పారావు, డి.రవినాయక్, బోజెడ్ల రాంమోహన్, మద్ది ప్రభాకర్‌రెడ్డి, కిరణ్, మాటేటి రవి, పసుపులేటి వెంకట్, మాటేటి కిరణ్ తదితరులు కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక దుప్పట్లు, పండ్ల పంపిణీ, అన్నదానం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంలో దుస్తులు, పండ్లు పంపిణీ చేస్తున్న తుమ్మల యుగంధర్, కార్పొరేటర్ శరత్‌కుమార్


రఘునాథపాలెం: మదర్‌థెరిస్సా ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న నాయకులు


కామేపల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


తిరుమలాయపాలెంలో..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్/నేలకొండపల్లి: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. ఈక్రమంలో ఖమ్మం నగరంలోని మమత సబ్‌స్టేషన్, టేకులపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మధురానగర్, రాఘవయ్యనగర్, వరదయ్యనగర్, నేతాజీనగర్, మమతరోడ్డు, పులిపాటినగర్, సాయినగర్, అబ్దుల్‌కలాంనగర్, చెరువు బజారు, కేసీఆర్ టవర్, ఖానాపురం, టేకులపల్లి, ఇందిరానగర్, చైతన్యనగర్, రోటరీనగర్, వైఎస్‌ఆర్‌కాలనీ, గోపాలపురం పారిశ్రామిక ప్రాంత, ఎస్‌ఆర్ గార్డెన్స్, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మంచుకొండ, బూడిదంపాడు, సూర్యాతండా, వాంకుడోత్‌తండా, పుఠానితండా తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అదేవిధంగా నగరంలోని బల్లేపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పారిశ్రామిక ప్రాంత సబ్‌స్టేషన్ పరిధిలోని బల్లేపల్లి, బాలపేట, జయనగర్‌కాలనీ, తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు. అంతేకాక నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నేలకొండపల్లి, పాత కొత్తూరు, కొత్త కొత్తూరు, తిరుమలాపురం, పైనంపల్లి, బోదులబండ, రామచంద్రాపురం, అనంతనగర్, కోరట్లగూడెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టండి

ఖమ్మంమయూరిసెంటర్: వన్ నేషన్-వన్ ఎలక్షన్ పేరుతో దేశ ప్రజలను నిరంకుశ పాలన వైపు తీసుకెళ్లేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, దేశ ప్రజల సమైక్యతకు కావాల్సింది వన్ క్యాస్ట్-వన్ నేషన్ అని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగానికి మతోన్మాద శక్తుల నుంచి ప్రమాదం పొంచి ఉందని, రాజ్యాంగ రక్షణకు యువతరం నడుం బిగించాలన్నారు. సంఘ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు. ఎస్సీలకు చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం అంబేద్కర్ అభయ హస్తం ద్వారా ఉపాధి కల్పించాలన్నారు. దళితులకు చెందిన అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసాద్, ఉపాధ్యక్షురాలు మాచర్ల భారతి, కార్యదర్శివర్గ సభ్యులు పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, కొమ్ము శ్రీను, నకరికంటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అందించి ఆదుకోవాలి

కామేపల్లి: ఈ ఏడాది పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు వెంటనే రైతుభరోసా అందించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామేపల్లి మండలం ఏన్నో ఏళ్లుగా అభివృద్ధి నోచుకోకుండా వెనకబడి ఉందని,కామేపల్లి మీదుగా వెళ్లాల్సిన సీతారామ ప్రాజెక్టును ఇప్పటి పాలకులు అడ్డుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని లేకుంటే మండల రైతాంగంతో కలిసి పోరాటం చేసి తమ హక్కులను సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యింజం నాగభూషణం, దుగ్గి కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలి


కైకొండాయిగూడెంలో విద్యార్థుల ప్రగతిపై ఆరా తీస్తున్న రవికుమార్

ఖమ్మంఅర్బన్: పరీక్షలను సులభంగా ఎదుర్కొనేలా విద్యార్థులకు తగిన శిక్షణ అందించాలని విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పాండురంగాపురం, కైకొండాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా 6వ, 9వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే మాదిరి పరీక్ష-3ను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కై కొండాయగూడెంలో పదో తరగతి విద్యార్థుల స్థాయిని పరిశీలించి పబ్లిక్ పరీక్షలను ఎదుర్కోవడానికి పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.12.40 కోట్ల జమ

నేలకొండపల్లి: పాలేరు డివిజన్‌లో 12,346 మంది రైతులకు పంట నష్టపరిహారం కింద రూ.12.40 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కూసుమంచి ఏడీఏ బి.సరిత అన్నారు. మండలంలోని పైనంపల్లి, నేలకొండపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించాక రైతు వేదికలో నిర్వహించన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈనేపథ్యాన చెరువుమాధారం గ్రామానికి చెందిన నల్లగొండ యల్లయ్య అనే రైతు పరిహారం అందకపోవడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఏఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, వ్యవసాయ విస్తీరణాధికారులు అవినాష్, దుర్గాభవాని, బి.శిరీష తదితరులు పాల్గొన్నారు.


ఏడీఏకు ఫిర్యాదు చేస్తున్న యల్లయ్య కుటుంబ సభ్యులు